భార్య

రుక్మిణికీ, నాకూ చిన్నప్పటినించీ స్నేహం. యిద్దరం ఒక బళ్ళోనే చదువుకున్నాము. మా యిళ్ళు దగ్గిరే. మాలో అంత అల్లరిపిల్ల యింకెవరూ లేరు. రుక్మిణి వస్తోందంటే, మొగపిల్లలు కూడా భయపడేవాళ్లు. మా ఆడపిల్లలం రుక్మిణి అంటే ప్రాణమిచ్చేసే వాళ్లం. ఆ అమ్మాయి లేకుండా ఇక ఆట, పాట, నోము, పండగ యేమీ జరగదు. అసలు జరిగినట్టే వుండేదికాదు. యెన్ని కొత్త ఆటలు కల్పించేది ! యెన్ని కొత్త పాటలు పాడేది! అట్లతద్ది వచ్చిందంటే మమ్మల్ని రెండింటికే లేపేది. ఇంక మా గోలతో వూరంతా లేచేది. వుయ్యాల శివంపట్టినట్లు ఒకటే వూగడం. చెట్టు కొమ్మల్లో మాయమై రివ్వున కిందకి దిగేది, రుక్మిణి వుయ్యాల. ఇంకా - చంటిపిల్లలు రుక్మిణి పేరు వింటే, తల్లుల చేతుల్లో నిలవకుండా దూకేవారు. సముద్రం పొంగినట్టు పొంగేవారు. ఆ అమ్మాయి మొహం చూడ్డంతోటే గలగలమని నవ్వులో, రుక్మిణి వాళ్ళనొక్కసారి యెగరేసి పట్టుకుందంటే వాళ్ళ వొళ్ళు పరవశమయ్యేది. "నన్ను ! నన్ను, నన్ను" అంటూ ఇరవైమంది కాళ్ళచుట్టూ మూగేవారు. "రుక్మిణి వచ్చి యెత్తుకుంటుందిలే. రేపు పొద్దున్నే" అని వొదార్చే వాళ్ళు తల్లులు, రాత్రి యేడ్చేపిల్లల్ని, పువ్వులూ, రంగుపీలికలూ కట్టి ఆ పిల్లల్ని తయారుచేసేది. యెంతో అందంగా వుండేవాళ్ళు. తలంటిపోసిన తరువాత ఎంత పెంకిపిల్లలయినా రుక్మిణి తలచిక్కు తీస్తూంటే ఒక్కసారన్నా ఏడవరు. పెద్దవాళ్లకీ, చిన్నవాళ్ళకీ, ముసలివాళ్ళకీ, అందరికీ రుక్మిణి అంటే అమితమైన ప్రేమ. "రుక్మిణీ ! ఒక్కసారి యిట్లా కూచో" అని వాళ్ళ చిన్నతనం కబుర్లన్నీ ఆ అమ్మాయికి చెప్పేవాళ్ళు ముసలమ్మలు. సృష్టిలో దయా, మృదుత్వమూ, సంతోషమూ, నవ్వూ కలిసి ఆ పిల్ల అయిందేమో అనిపించేది.

ఇంక తెలివో ! ఏ పుస్తకమన్నా చదివి జ్ఞాపకముంచుకుంటుంది. మళ్ళీ తను మూడోక్లాసు చదివేదా ? వాళ్ళింట్లో ఫస్టుఫారం చదివే వారం కుర్రవాడికి లెక్కలు చేసిపెట్టేది. ఒకవారం ఆ కుర్రవాడి దగ్గర ఇంగ్లీషు అక్షరాలు నేర్చుకుంది. వెంటనే పేర్లు చదివేసింది. పాటలు, మంగళహారతులు. హాయి హాయి ఎట్లా పాడేది ! ఆ అమ్మాయి గొంతుకలో ఏ ముండేదో! ఏ పిచ్చిపాట పాడినా, గొప్ప సంగీతంలా వుండేది. తోవన పోయేవాళ్ళు సహితం ఆశ్చర్యంతో ఆగి వినేవాళ్ళు, కుట్లు మాత్రము రుక్మిణి కిష్టంలేదు. ఎన్నిసార్లో తంటాలుపడ్డది కాని, ఆ వ్రేళ్ళకి ఒక్క మెలిక తిప్పడమన్నా చాతకాలేదు. రుక్మిణికి భయమన్నమాట లేదు. అర్ధరాత్రయినా ఎక్కడికంటే అక్కడికెడుతుంది. ఎవరిని చూచినా భయంలేదు. ఒకసారి రుక్మిణి మేనత్త కొడుకు పోలీసు ఇనస్పెక్టరు అతన్ని లెంపకాయకొట్టింది, ఏదో కోపమొచ్చి. ఎవరి సంగతన్నా సరిగా లేదని తోచిందంటే వారూ వీరని లేదు; ఎంతమాటంటే అంతమాట అనేస్తుంటుంది. మొహమాటం ఏమీలేదు. "ఏమండీ ! మీ కోడల్ని అట్లా బాధపెడతారేం? మీకేం జాలిలేదా ? మనుషులేనా?" అంటుంది, ఒకర్ని. "ఈ డబ్బంతా

కట్టికెడతారా? ఒక్క పైసా ఖర్చు చెయ్యరేం?" అంటుంది ఇంకొకర్ని. ఒకరింటో మొగుడు పెట్టే బాధ పడలేక భార్య బావిలోపడి చచ్చిపోయింది. రుక్మిణి ఆయన దగ్గిరికి వెళ్లి "ఆమెని చంపింది మీరే? భార్య గనక యెవరూ ఏమీ అనరు. ఇంకొకర్నయితే ఈపాటికి మిమ్మల్ని వురితీసేవారే" అంది. ఆయన మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని చూశాడు. రుక్మిణి ఆ ఊరంతా చెప్పింది. ఆయనకి పిల్లనివ్వద్దని. బయట ఊరునించి ఏదోసంబంధమొస్తే, వాళ్ళతోగూడా పనిబట్టి "మీ పిల్లని చంపుతాడు. ఇవ్వకండి" అని బతిమాలి వచ్చింది. అట్లాంటిది రుక్మిణి.

రుక్మిణి అందమయిన పిల్ల. కొంచెం పొట్టీ, లావూ, నాకంటే రెండేళ్ళు చిన్నది. కాని నాకంటే పెద్దది లాగుండేది. అందరికీ ఆ అమ్మాయి మొహం చూస్తే ముద్దు. కాని మొగాళ్లు ముట్టుకుంటే వూరుకునేది కాదు. ఆ అమ్మాయికి శరీరంమీద ఎంతో అభిమానం. ఎప్పుడూ స్నానంచేసి శుభ్రంగా వుండేది. ఒక్క రవ్వ మురికి కూడా పనికిరాదు. చంటిపిల్లలయినా సరే, బాగా తుడవంది యెత్తుకోదు. మా యిద్దరికీ పెళ్ళిళ్లయినాయి. రుక్మిణిని రెండో పెళ్ళి ఆయనకిచ్చారు. కాని అట్టే పెద్దవాడు కాడు. ముప్పైయేళ్ళుంటాయి. అత్తవారు చాలా నగలు పెట్టారు. పెళ్ళవగానే ఆ పిల్లని బడిమానిపించారు. రుక్మిణి యెప్పటివలెనే ఆడుకుంటోంది.

రుక్మిణి పెద్దయినకొద్దీ అందమయిన పిల్ల అయింది. అందరూ ఆ అమ్మాయివంక చూసేవారు. ఒకరోజు పొద్దున్న రుక్మిణి మా వాకిట్లో నించుని వుంది. మా బడిపంతులు వొకాయన (ఆయనకి పూర్వం బళ్ళో రుక్మిణంటే చాలా ఇష్టం) మా అన్నయ్యతో మాట్లాడి బయటికి వెడుతూ రుక్మిణిని చూసి దగ్గిరికి వొచ్చాడు. "రుక్మిణి ! ఎంత పెరిగింది !" అని భుజంమీద చెయ్యివేశాడు చనువుగా. "నన్ను ముట్టుకోకండి. నాకు బాగుండదు" అంది. కోపంతో విదుల్చుకుంది. నేను పెద్దదాన్నా, నేనన్నా అట్లా అనను. ఆయన నవ్వి బుగ్గపట్టుకున్నాడు. ఏం చేసిందో తెలుసునా! వీపుమీద చఱ్ఱున అయిదువేళ్ళు తేలేట్టుకొట్టింది. అతను తెల్లబోయి చూసి, "పిచ్చా!" అని వీపు తడుముకుంటో వెళ్ళిపోయినాడు. రుక్మిణికి అంత అభిమానమూ, పౌరుషమూను.

"నేనింక రెండు నెల్లకి అత్తవారింటికి వెడతాననగా ఏదో జరిగింది. అప్పుడు రుక్మిణికి పదకొండేళ్ళు. ఆ అమ్మాయి పెనిమిటి దీపావళికి వచ్చి రెండురోజులు వుండి వెళ్ళాడు. ఆ రెండు రోజులూ రుక్మిణి మాక్కనపడలేదు. ఆయన వెళ్ళినరోజు మధ్యాహ్నమే వచ్చింది. అక్కయ్యా, అన్నయ్యా, నేనూ ఒకటే హాస్యాలు చేశాము ఆ అమ్మాయిని. రుక్మిణిని హాస్యం చేయడమంటే చాలు కులాసా మాకు. ఎన్నడూ వుడుక్కోదు. మాటకిమాట చమత్కారంగా బదులు చెపుతుంది. ఆ అమ్మాయి మమ్మల్ని అనే మాటలు వినడంకోసమే మేమూ ఆ అమ్మాయిని అనేవాళ్ళము. కాని ఆవాళ ఏమీ మాట్లాడలేదు. తల తిప్పేసింది. గుడ్లలో నీళ్లు తిరిగి కాటికలోంచి కారి, నల్లగా కిందపడ్డాయి. చివాలున లేచి.... మేము పడుకునే గది పక్కన ఉంది.... దాంటోకి వెళ్ళి తలుపు వేసుకుంది. ఒకళ్ళ మొహాలు

ఒకళ్ళం చూసుకున్నాం. రుక్మిణి ఎన్నడూ అట్లా చెయ్యలేదు. ఆ మొహంలో నవ్వే గాని, ఎన్నడన్నా ఏడుపు చూశామా! భయం వేసింది. ఏదో గొప్ప బాధ తటస్థించి వుండాలి.

కొంతసేపుండి, తలుపుతీసి, నేనొక్కదాన్నీ గదిలోకి వెళ్ళాను. చుట్టి పెట్టిన మా పరుపులమీద బోర్ల పడి వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేను దగ్గిర కూచుంటే, "నన్ను ముట్టుకోకు, పో, పో" అని చాలా తీవ్రంగా తోసేసింది. ఎంత బతిమాలుకున్నా ఏమీ చెప్పలేదు. వూరికే ఇటూ అటూ కొట్టుకుంటుంది. జుట్టు పీక్కుంటుంది. ఊపిరి బిగబట్టి, చచ్చిపోయేదానివలె అవుతుంది. నాకు భయమేసి ఎవరినన్నా పిలువబోతే, పోనియ్యదు. చాలాసేపటి తరువాత చివరికి, సర్దుకొని మొహం కడుక్కొని తలని దవ్వుకుని వెళ్ళిపోయింది. అంతే అవ్వాళ్ళనించి రుక్మిణి నవ్వలేదు. ఆడలేదు. యెవరింటికి వెళ్ళలేదు. చంటిపిల్లలనన్నా పలంకరించదు. వూరంతా చిన్నపోయింది యెవరికీ ఏమీ తోచలేదు. పిల్లలు ఆటలే మరిచిపోయినారు. కాని ఎవరికీ కారణం తెలీదు.

రెండు నెలలయింది. నేను అత్తవారింటకి వెళ్లాను. వెళ్ళిన ఆరు నెలలకే రుక్మిణిని గురించి విచిత్రమయిన సంగతులు వినడం మొదలుపెట్టాను. మొదట నేను నమ్మలేదు. తరువాత రుక్మిణిని బాగా యెరిగినవారూ, ప్రేమించినవారూ, బంధువులూ అందరూ ఒకటేమాట చెపితే నమ్మక ఏం చెయ్యను? చాలా ఆశ్చర్యం వేసింది. రుక్మిణి అట్లాంటిది అవుతుందని నేనెన్నడూ అనుకోలేదు. ఎక్కువ విచారమయింది మొదట్లో, తరువాత ఆ పనులు నేనే చేసినట్లు సిగ్గేసింది. తరవాత తరవాత తక్కిన విషయాలు వినేటప్పటికి అసహ్యం వేసింది. చివరికి ద్వేషం మొదలుపెట్టింది.

ఒకసారి మా పుట్టింటికి వెళ్ళినప్పుడు రుక్మిణి కనబడ్డది. అప్పుడే భర్త ఇంటిదగ్గరినించి వచ్చేసింది. వూరంతా గలాభాగా వుంది. గుంపులు గుంపులు కూడి ఆడవాళ్ళు ఆ అమ్మాయి సంగతే చెప్పుకుంటున్నారు. ఒకనాటి మధ్యాహ్నం హఠాత్తుగా నేను వాకిట్లో నుంచుని వుంటే నావేపు వచ్చింది. యెవరిది ? రుక్మిణే ! ఎంత మారిపోయింది. అంత దృఢమైన పిల్ల సన్నగా వుంది. కళ్ళు గుంటలుపడ్డాయి. ఏదో భయం చూపు వచ్చింది కళ్ళల్లోకి. లోకంలో విశ్వాసం పోయి, బతుకుమీదే ఆశపోయిన దానివలె కనబడ్డది. ముసలిదాని మొహంవలె, మొహం ముడుచుకుపోయింది. వెంట్రుకలు అక్కడక్కడ తెల్లబడ్డాయి. నా దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకుంది. చప్పున లోపలికెళ్ళి తలుపేసుకున్నాను. తరవాత ఆ అమ్మాయి చూపు తలుచుకుంటే జాలేసింది. విచారపడ్డాను, పాపం. గుండెపగిలిన దానివలె కనపడ్డది. నా దగ్గరకెందుకొచ్చిందో? స్నేహంవల్లనా? కాని ఆ అమ్మాయికి అట్లా కావలసిందే! తను చేసిన పనులో! ఛీ! దానితోనా మాట్లాడేది! అయినా మాట్లాడివుంటే నేం?..... ఆఖరుసారి రుక్మిణిని అదే చూడడం.

రుక్మిణి గురించి నేను విన్న సంగతులివి, నేను విన్నవేకాదు. లోకమంతా అనుకున్నవే. ఇవి నిజం కాదేమోనని ఎవరికీ సందేహం కలగలేదు. ఇవి నిజమని మీ కెట్లా

తెలుసునని అడగవలసిన అవసరం లేకపోయింది. రుక్మిణిని ప్రేమించినవాళ్ళూ, నమ్మినవాళ్ళూ, అందరూ ఇదే మాట. ఆ వూళ్ళో కళ్ళారా చూశామని చెప్పినవాళ్ళున్నారు.

ఆ అమ్మాయి భర్త కార్యం చేసుకోడానికి వస్తే, "నాకు కార్యం అక్కరలేదు. నాకు ఒక మొగుడు పనికిరాడు. ఈ వూళ్ళో మణి, నా స్నేహితురాలు దానివలె నాకూ భోగందాన్ని కావాలని వుంది" అందిట. తనకి ఎక్కువగా డబ్బిస్తేగాని, ఆ రాత్రి తనని ముట్టుకోవద్దంది మొగుణ్ణి. అప్రతిష్ట అని దాని పెనిమిటివాళ్ళు వూరు తీసుకెళ్ళాలంటే రానందిట. ఆఖరికి బలవంతంమీద తీసుకెళ్ళారు. అక్కడ ఆ అత్తగారూ ఇట్లాంటిదేట. ఆ పెనిమిటెంత మంచివాడో! దాన్ని మధ్యతోవలో పట్టుకుని వెనక్కు తీసుకెళ్ళాడు. చివరికి విసుగెత్తి, ఎట్లాగో తప్పించుకుని వాళ్ళ వూరు వొంటరిగా లేచివచ్చింది. తాతా, తల్లీ తిట్టారు. వాళ్ళనే తిట్టి భోగం మణి ఇంటికి లేచిపోయి, దానితో కాపురముంది. మహాత్ముడు ఎంత దయో, ఆ పెనిమిటి మళ్ళీ వొచ్చి; దాన్ని రమ్మంటే, ఆ వూరి రౌడీలను పోగుచేసి, తనూ అదీ కలిసి ఆ పెనిమిటిని తన్నడానికి సిద్ధమైనారు. అప్పుడు "అయ్యో! వృధాగా ఇట్లా పాడవుతూందే" అని విధిలేక పోలీసుకి రిపోర్టు చేశారు. వాళ్ళూ, నయానా భయానా చెప్పి చూశారు. ఇంక పెనిమిటి దగ్గిరికి పొమ్మని బలవంతం చెయ్యపోతూంటే కాలవలో పడి చచ్చింది.

రుక్మిణి ఇదంతా చేసింది అని పెద్ద వాడుక. ఎంత అక్రమం ! ఆ పిల్లకి ఏదో గ్రహబాధ తటస్థించి వుంటుంది. వీళ్ళు పాపం ఆ పిల్ల స్వబుద్ధితోటే చేసిందనుకున్నారు. ఆ అమ్మాయి చచ్చిపోయిందని విన్నా నాకేమీ దిగులెయ్యలేదు.

ఇదంతా అయిన నెల్లాళ్ళకి ఆ వూరు వెళ్ళాను. మా వదినకి సుస్తీగా వుంటే కాలవకి నీళ్ళకి నేనే వెళ్ళాను. ఒకరోజు సాయంత్రం, చీకట్లో ఎవరో ఆడమనిషి నా చేతిలో ఒక కాగితాలకట్ట పెట్టి తొరగా వెళ్ళిపోయింది. ఇంటికొచ్చి చదవడం మొదలుపెట్టాను. చదువుతో వుంటే నా మనసెట్లా అయిందో, దీన్ని చదివితే మీకే తెలుస్తుంది. అవి చచ్చిపోయిన రుక్మిణి రాసింది.

సీతారామమ్మకి :- నామీద నీకు అమితమైన కోపమని తెలుసు. నా పేరు చెపితే ఉమ్మేస్తావు. మీ బోటివాళ్ళు పవిత్రమయిన ఉమ్మి నా వొంటిమీద పడటానికి కూడా వీలులేదు. నాచేత్తో తాకిన యీ కాగితాలు చదువుతావో! లేదో! చదవకపోయినా నష్టమేమీ లేదులే. అయినా నీకు రాయాలని మనసు పీకుతోంది, చిన్నప్పటి మన స్నేహం నీవు మరిచిపోయినా నేను ఎందుకో మరిచిపోలేదు. పతివ్రతలు మీరు. మలినమైన నా పేరుని తుడిచేశారు నిర్మలమయిన మీ మనస్సులోంచి. కాని మీ ప్రతిష్ట గల జీవితాల జ్ఞాపకం మాత్రం నా పరిశుభ్రమయిన మనసులో వుండిపోయింది. మీ ముఖాలూ, మాటలూ, దయా, నానించి తప్పించేశారు గాని మీ జ్ఞాపకం మాత్రం తీసుకోలేకపోయినారు.

నన్ను గురించి లోకమెట్లా మాట్లాడుతోందో కొంతవరకు తెలుసు నాకు. ఎటువంటి దుర్మార్గులైనా సరే, మర్యాదగా పైకి తిరిగితే సరి, వారి ముందు మనుష్యులు మొహమాటం

విడిచి, తోచిందల్లా మాట్లాడరు. కాని పేరూ, ప్రతిష్టా, సిగ్గూ, బిడియమూ, పుణ్యమూ, పాపమూ, ప్రాతివ్రత్యమూ నీతి వొదిలేసిన నాముందు నోటికొచ్చినట్టల్లా మాట్లాడ్డానికి జంకెవరికి ? వడ్డీలకిచ్చి కొంపలుకూల్చే పెద్దలూ, లంచాలు పుచ్చుకునే పోలీసులూ, కోడళ్ళని ఆత్మహత్య చేసుకునేటట్లు చేసిన ముత్తయిదువులూ, మొగుళ్ళని మోసపుచ్చే పతివ్రతలూ, అందరూ నా మొహాన తిట్టేవారే! నిజం ఒకరికన్నా తెలియాలని నాకు వుంది. తలుచుకుంటే ఇప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. రెండేళ్ళ కిందట ఎంతమంది స్నేహితులు, బంధువులు నాకు! అందరూ నన్ను పలకరించే వారే, నా స్నేహం కోరేవారే! ఈవేళ నన్ను కన్నెత్తి చూసేవారు లేరు, ఒక్కరు - ఒక్కరూ లేరు. ఈ భోగంది సంఘానికి, నీతికీ, చెడిపోయినది తప్ప. ఇందరిలో ఒకరయినా, "నిజమేమిటి? నువ్వెందుకిట్లా అయినావని" అడిగినవారు లేరు. ఇదీ స్నేహం! జరిగినదాంట్లో కొంతమట్టుకు నిజం నా భర్తకి తెలుసు. అంతకంటె తెలుసుకోవడానికి ఆయన చేతకాదు పాపం. ఆయన్ని చూస్తే దిగులేస్తుంది.

ఆయన వంటివారు నర పశువులు వేలకు వేలుండగా ఆయనకి మాత్రమే వొచ్చింది యీ కష్టమంతా. నా వంటిదాన్ని నావంటి సిగ్గుమాలిన కొరివిని; పెళ్ళి చేసుకోడంవల్ల, ఆయనకి తెలిసిన సంగతులు కూడా నిజం దాచకుండా బయటపెట్టేటంత ధైర్యం ఆయనకి లేదు. ఆయన మర్యాదస్తుడు. అట్లాంటి సంగతులు ఇంకొకరితో మాట్లాడతాడా! అందులో నిజం. మర్యాదస్తులు ఎప్పుడూ ఇట్లాంటివి నిజం చెప్పరు. చెపితే సిగ్గుమాలిన వారని, మర్యాదస్తులు, బహిష్కారం చేస్తారు.

ఈ కాయితాలు, నా ఆప్తబంధువురాలు, ఈ వూళ్ళో ప్రసిద్ధి కెక్కిన బోగంది మణికి ఇస్తున్నాను. ఆమె నీకిస్తుంది. ఆమె ఇయ్యకుండా వుండదు. మర్యాదస్తురాయితేగా, పైకి ఒకమాట చెప్పి, లోపల ఇంకొకటి చెయ్యడం! నీతి సమర్థనకోసం ఉత్తరాలు దాచెయ్యడం!

ఈ కాగితాలు ఏ మర్యాదస్తులకైనా దొరకనీ ! యెక్కడ సంఘం పేరు చెడిపోతుందో, ఎక్కడ బటయకి రాకూడని సంగతులు వస్తాయో అని నాతో భద్రంగా వుంచుతామని చెప్పి, వెనకాలే తగలపెడతారు. చచ్చిపోయే నేను వొచ్చి అడగనుగా! అన్నట్లు యీ మర్యాదస్తులికి స్వర్గంలో నమ్మకంలేదు. మళ్ళీ కలుసుకోమని వారి నమ్మకం ! అయినా నేను నరకానికి వెడతానయ్యెను! వారిది స్వర్గమయ్యెను ! వారడగడానికి వొస్తే నేను "యీ పాడుముండ వొచ్చిందని నాలుగు గెంట్లు గెంటిస్తారు. ఈ కాగితాలు చదివి కూడా నీకు నామీద కోపం పోకపోతే పోకపోవచ్చు. అయినా చదివి చూడు.

ఈ రాత్రి మీ లోకంలోనించి వెళ్ళిపోతున్నాను నాకు పదహారేళ్ళు రాలేదు యింకా. కాని నూరేళ్ళు అనుభవం అయిపోయింది. ఇంక చాలు యీ లోకం. ఇట్లాంటి దుష్టాత్మురాల్ని ఇంక యీ భూమి మొయ్యలేదు. ఈ రాత్రి నీళ్ళైనా నన్ను స్వీకరిస్తాయో లేదో. నేను చచ్చిపోయినానని తెలియగానే యెందరో సంతోషిస్తారు. ముఖ్యంగా నా భర్తగారు. వారం రోజుల్లో ఇంకొక చెప్పినమాటవినే చక్కని భార్యని తెచ్చుకుంటారు. సందేహం

లేదు. నావంటి నీతిబాహ్యురాలు పోతే ఇంకోదాన్ని తెచ్చుకుంటారు. సందేహం లేదు. పెళ్ళాడడంలో వింతలేదు. ఎందరు పతివ్రతలనుకున్న పెళ్ళాలు చచ్చిపోతే పురుషులు వెంటనే ఇంకోదాన్ని పెళ్ళాడడం లేదూ !

ఇదివరకే నాతో ఆయనకి పడటంలేదని, వేరే సంబంధాలు వొచ్చాయి. తరవాత మా తాతయ్యా, అమ్మా, పాపం నా మూలంగా ఆ మర్యాదస్తుల కుటుంబానికి యెంత అవస్థవచ్చింది! ఎట్లానన్నా నేను వాళ్ళ బిడ్డని కాననిపించుకోవాలని యత్నించారుగాని, వీలులేకపోయింది. లోకమంతా వారికి వొచ్చిన ఆపదకి వాళ్ళని వొదార్చింది. కాని లోపల వాళ్ళకి అనుమానమే, ఇట్లాంటి పిల్లని ఎట్లా కన్నారా అని ఆశ్చర్యంతో వాళ్ళని కూడా నాతో జతచేస్తున్నారని, మర్యాదస్తులం కాదూ? మర్యాదస్తులకీ అనుమానం. మొహం ముందర స్తుతి వీపు వెనక నవ్వులూ ఇదేగా మర్యాదంటే ! "మహలక్ష్మమ్మగారి కూతురు లేచిపోయింది అనడం తప్పులేదుగా ! పాపం. మా అమ్మకి ఎంత కష్టం వొచ్చింది ? ఎందుక్కన్నానా అనుకుంటోంది. చిన్నప్పుడు ఇటువంటి బిడ్డ ఎవరికీ లేదని గర్వపడ్డ రోజులు. నా ఆటలూ పాటలూ చూసి ఆనందబాష్పాలు రాల్చిన దినాలు. నన్ను వొళ్ళో కూచోపెట్టుకుని మా నాన్నని తలచుకుని ముద్దుపెట్టుకున్న సమయాలు మరిచిపోయింది. ఇంకా నా స్నేహితులందరూ సంతోషిస్తారు నేను పోతే. నా సంగతి ఏమిటని ఎవరన్నా అడిగితే చెప్పలేక, వారి స్నేహితురాల్ని కానని నిరాకరించలేక, విసుగెత్తిపోతుంది పాపం వాళ్ళకి !

"మాకు తెలియదు మునుపుగూడా అట్టే స్నేహంలేదు. ఆ అమ్మాయికీ నాకూ"

"ఈ పొగరుబోతుతునం చిన్నప్పుడూ వుండేదమ్మా !"

"ఇన్నాళ్ళూ దాన్ని తిరగనిచ్చాము మనలో"

"అప్పుడు మాత్రం దానికట్లాంటి గుణాలు లేవనా ?"

"మన పిల్లలు నేర్చుకోకముందే పోయిందిలే ? అదోనయం."

"పోయింది ! మంచిపని అయింది. వుంటే మనం తలెత్తుకు తిరగడానికి వీలుందా !"

"ఆ హృదయంలో అంత భారం పెట్టుకుని ఎన్నాళ్ళు బ్రతుకుతుంది?"

ఈ మాటలన్నీ నాకు అప్పుడే వినబడుతున్నాయి.

నువ్వు మీ అత్తగారింటికి వెడతావనగా ముందు నేనొకరోజు మీ ఇంట్లో యేడ్చాను చూశావా ! అంతకు రెండు రోజులు ముందు నా భర్త మన వూరు వచ్చాడు. అప్పటినించి మొదలు నా విచారము, నా నరకము, నా బాధ, నా మరణము నమ్మా. నిజంగా నమ్మా. అంతకుముందు పెళ్ళి అంటే ఏమిటో తెలీదు నాకు. కాని మొగాళ్ళు ముట్టుకుంటే నాకు

కోపం. అవాళ మనపంతులే కాదు. ఇంకా చాలామంది ఆడుకునేవాళ్ళు, వాళ్ళందరినీ కొట్టేదాన్ని. నన్ను వూరికే ముట్టుకోడానికీ, ఆ విధంగా ముట్టుకోడానికీ, ఎట్లానో భేదం తెలిసేది. నన్నూ, నా శరీరాన్ని అవమానం చేసినట్లుండేది. మా తాతయ్య బావమరిది నన్ను మొహం ఎంగిలి చేసేటట్టు ముద్దు పెట్టుకుంటే, ఆయన్ని మొహమంతా రక్కాను! నా అసహ్యం చూసి కూడా మా అమ్మ ఏమీ అనేది కాదు. కొంచెం పెద్దదాన్ని అయింతరవాత కూడా నన్ను వొక్కదాన్నీ చేసి రొమ్ముమీద చెయ్యి వేసేవాడు. నా వొళ్ళుకాలేది. ఎవరితోనూ చెప్పేదాన్నికాదు. ఎంత కష్టంగా వున్నా సిగ్గు చాలా వుండేది. రక్కేదాన్ని, కరిచేదాన్ని, వుమ్మేశాను. కష్టంమీద నవ్వి వూరుకుంది. నాకెంత యేడుపొచ్చింది? పారిపోదామనుకున్నా, ఒకసారి రాత్రి అతన్ని చంపేద్దామనుకున్నా. ముట్టుకున్న చోటల్లా పదిసార్లు కడిగేదాన్ని. తరవాత అతను అట్టే బాధించడం మానివేశాడు. అయినా పూర్తిగా వొదలలేదు.

అన్నిట్లోకీ మా అమ్మ నవ్వి వూరుకోవడం మాత్రం నన్ను చంపుకున్నట్టుండేది. ఏమి కష్టం కలిగినా అమ్మ తీరుస్తుందని నమ్మకముండేది. మా అమ్మ యెందుకట్లా వూరుకుందో తెలీదు. మొహమాటమో, లేకపోతే నా బాధ అర్థంకాలేదో ! అవును మా అమ్మకి అట్లా చేస్తే సంతోషమేమో? నామీద యీర్ష్యయేమో? నన్ను కన్న దయగల తల్లి నేను బాధపడుతున్నానని తెలిసి ఊరుకుంటుందా? యిట్లాంటివి ఇంకా కొన్ని జరిగాయి. కాని పెళ్ళి అంటే మాత్రం అవాళ మధ్యాహ్నం దాకా నాకు తెలియదు.

మధ్యాహ్నం రెండుగంటలయింది. మామూలు ప్రకారం అమ్మ కాఫీ తీసికెళ్ళి నా భర్తకియ్యమన్నది. ఎప్పటివలెనే గదిలోకి తీసికెళ్ళాను. తలుపెయ్యమన్నాడు. నేను కదల్లేదు. తనే లేచి తలుపేసి వచ్చి నన్ను గట్టిగా పట్టుకుని మంచంమీద తోశాడు, నాతో మాట్లాడలేదు. లాలించలేదు. చనువు చేయలేదు. నాకు యెందుకో యేమిటో అప్పుడు తెలీదు. పిల్లి పట్టుకుంటే పిట్ట అంత భయపడదు. గిల గిల కొట్టుకున్నాను. నొప్పి, నొప్పి, నొప్పి తలుచుకుంటే ఇప్పుడు వణుకు వొస్తోంది. నావళ్ళు నాది కాదనిపించింది. యేడ్చాను. అరిచాను. బిగ్గిరిగా ఊరంతా వినపడేటట్టు అరిచాను. మా అమ్మవాళ్ళు తలుపుకొట్టి, ఆయన్ని యింటోనించి తరిమేస్తారనుకున్నాను. ఒక్కరూ రాలేదు. ఆ అరుపులు విని చచ్చిపోతున్నాననుకోవచ్చు. వాళ్ళకి ముందే తెలుసు. నోర్మూర్చుకుంటో నా అరుపులు విని సంతోషిస్తున్నారనుకుంటా. ఇప్పుడు ఆలోచించి. నన్ను చంపతలచుకున్నాడు, చంపడానికి ఇదోవిధం అనుకున్నాను. ఏడ్చాను. చేతులు పట్టుకుని బతిమాలుకున్నాను. అతి దీనంగా. చాలా భయమేసింది. ఏం లాభం కటికవాడికన్నా అరిచే గొర్రెమీద దయ కలగవొచ్చు. అంతేకంటే నా ప్రాణం కోసం పోట్లాడినట్లు పోట్లాడాను. ఆయనకి చిక్కలేదు. విసుగుతో వొదిలేసి తటాలున లేచి కోపంతో "పో" అని ఒక తన్ను తన్నాడు. బయటికి వచ్చిపడ్డాను. మళ్ళీ యెప్పటి ఇల్లుచూసేటప్పటికి ప్రాణం లేచివచ్చింది. మనుష్యుల్లో పడ్డాను కదా అని ధైర్యం వచ్చింది. పెద్దగా ఏడుస్తోవెళ్ళి అమ్మని కావలించుకున్నాను. చిన్నప్పుడు

కూడా యే బాధ వచ్చినా బిగ్గరిగా ఏడ్చేదాన్నికాదని అమ్మ అనేది. అవాళ యేడ్చాను. అది వొక్కసారే, గొంతెత్తి యేడ్చింది. అప్పణ్ణించి యాడవలేదు. యేడుపు వొస్తే బావుండును. రాదు. విచారం గడ్డ కట్టింది. ఇంక యాడవను కదా! ఇదే ఆఖరుసారి యేడుపు యీ కాయితాల ద్వారా నీతో.

ఎప్పుడు యే బాధ వొచ్చినా, యెవరు నన్నేమన్నా, అమ్మతో చెప్పితే వాళ్ళని శిక్షించి, నన్ను బుజ్జగిస్తుందని నా నమ్మకం. అత్తా, అమ్మా, నన్నూ నా ఏడుపునే చూసి బిగ్గిరిగా నవ్వారు. వాళ్ళకి నా బాధ, విచారం అర్థమే కాలేదు. నామీద చెయ్యేసి, "ఏం చేశాడు? కరిచాడా? యెక్కడ?" అంది అత్త. వాళ్ళిద్దరికీ యిమాజినేషన్ చచ్చిపోయింది. నాకు ముందే అంతా తెలుసుననుకున్నారా? వాళ్ళు చెప్పందే యెన్నడూ? అన్నం తినడంతోపాటు నిద్రపోవడంతో పాటు, వాళ్ళకి మామూలయింది గావును ఇట్లాంటిది? కాని అత్తకో! యెంత సంతోషం, యీర్ష్య, నోరూరడం కనపడ్డది ఆమె కళ్ళల్లో! ఆమె తులిసికోటని మైలచేస్తే, రాక్షిసిలాగు మీదపడి చక్కని తిట్లు, ఆ తులసిమంత్రాల నోట్లోంచి తెప్పించేది. కాని ఆయన నామీద అట్లా పడితే ఒక్క తిట్టూ రాలేదు. అందమైన వెలికి నవ్వొకటొచ్చింది. తనకేదో ఆయన వుపకారం చేసినట్టుంది ఆమెకి.

పరుగెత్తుకుపోయి గదిలో పడ్డాను. నా వొంటివంక నేను చూసుకోలేదు. ఆ రోత, ఆ అసహ్యం, ఆ మురికి తలుచుకుంటే ఇప్పుడు కండలు పీక్కుంటాను. ఇంకోడెవడన్నా తాకితే, వాణ్ణి రక్కి కొట్టేదాన్నే! వీడు వొంటరిదాన్నిచేసి, అమాంతం నన్నట్లాపడేసి.... అమ్మో! తలుచుకోలేను, ఇంకా యెట్లా బతికివున్నానో!

అప్పుడు నాకు మీ ఇంటో అంత ఏడుపు వొచ్చింది. అందుకనే ఎవరితో చెప్పుకోను! బతుకుమీద విరక్తి పుట్టింది. ఇంకొకళ్ళ మొహం చూడ్డమంటే సిగ్గేసింది. రాత్రింబవళ్ళు అదే తలుపు నన్నట్లా వొంటరిగా, బలవంతంగా చేసినవాణ్ని ఏం చెయ్యాలి? నా హృదయంలో సంతోషం. లోకమంటే ఆనందం, మనుష్యులంటే నమ్మకం అన్నీ పోయినాయి.

ఆయన వెళ్ళిపోయినాడు. వెళ్ళినప్పటినించీ మా అమ్మకీ, తాతయ్యకీ వుత్తరాలు "ఎన్నాళ్ళు ఆగాలి?" ఇంకా మీ పిల్ల యెందుకు పెద్దమనిషి కాలేదు? అప్పుడే పదకొండేళ్ళన్నారే? ఇంతకాలం పెద్దమనిషి కాదని తెలిస్తే, వేరే సంబంధం అప్పుడే కుదుర్చుకునేవాళ్ళమే ?" అని. ఈ ప్రకారం వారానికన్నా ఒక వుత్తరం వొచ్చేది. మూడు నాలుగు నెలలయినా తరవాత "పెద్దమనిషి కాకపోయినా అవుపోసనం చేసి పంపవలసింది. వచ్చే నెలలో ముహుర్తాలున్నాయి" అని వుత్తరం వొచ్చింది. మా తాతయ్య వొప్పుకోలేదు. దానితో వాళ్ళకి చాలా కోపం వచ్చింది. "మీ పిల్ల మాకక్కరలేదు. వేరుసంబంధం విచారించుకుంటున్నాం"మని రాశారు. ఆ వుత్తరంమీద మా ఇంట్లో తాతయ్యకీ, అత్తయ్యకీ, అమ్మకీ తగాదాలూ, యేడుపుల వరకొచ్చింది. అత్తయ్య నన్ను వెంటనే వాళ్ళ దగ్గిరికి

పంపెయ్యమంటుంది. అత్తకి పెనిమిటి యెనిమిదోయేట పోయినాడు. అందుకనేయేమో, నన్నూ నా పెనిమిటినీ వొకచోట వొదలడమన్నా, నన్నత్తవారింటికి పంపడమన్నా చాలా ఇష్టం. కాని తాతయ్య ఒప్పుకోలేదు. అమ్మా, అత్తా, పోట్లాడి ఏడ్చారు కూడాను! వాళ్ళు వేరే పెళ్ళి చేసుకుంటే చేసేదేమిటి? నా భారం వీళ్ళమీద వుండిపోతే! మా అత్త భారం అమ్మ భారం ఆ ఇంటిమీద వుండగా లేనిది నాది వుంటుందనా ఇంత భయం. ఇంక యేం చాతకాక మా అత్త నన్ను తిట్టటం మొదలుపెట్టింది. నేనేం చేశాను?నాకు తలంటి పోసేటప్పుడు వినరాని మాటలు అనేది. కాని అతను ఇంకో పెళ్ళి చేసుకుని నన్ను వొదిలేస్తాడని తెలిసి నా సంతోషానికి మేరలేదు. ఎన్ని తిట్టినా మా వాళ్లు, ఆనందం ఆగేది కాదు. సంగీతం పాడుతూ తిరిగేదాన్ని, ఇంకా ఎప్పటికీ చిన్నదాన్నిగా వుంటేనే బాగుంటుందనుకున్నాను. కాని ఏమనుకున్నాడో ఏమో మా తాతయ్య నేను పెద్దమనిషైనానని వుత్తరం రాసేశాడు. వారంలో ముహూర్తం పెట్టి కార్యానికి వొస్తున్నామని రాశారు వాళ్ళు, అప్పుడు ముహూర్తం లేదే అని మావాళ్ళాశ్చర్యపడ్డారు. కాని వాళ్ళేమంటారో అని వూరుకున్నారు. మా తాతయ్యకి కూడా ఈ గోల అంతా చాలా విసుగనిపించింది. అదిగాక ఎవరో మధ్యవర్తులొచ్చి మా తాతయ్యని బెదిరించి ఒప్పించారట.

ఎట్లానన్నా ఈ గోలంతా వొదిలిపోతే చాలుననిపించింది ఆయనకి. ఆయనకి వొదిలింది గాని నాకు మొదలు పెట్టే గోలసంగతి యెవరాలోచించారు? నాకు వొళ్లు వొణకడం మొదలుపెట్టింది. పెళ్ళంటే ఏమిటో తెలిసిపోయిందిగా! రాత్రులు నిద్రపట్టదు. అదే భయం. అన్నం సరిగా తినలేదు. వాళ్ళకేం? నాకు ఆ బాధంతా, చిన్నపిల్లని నాకూ! యెన్నాళ్ళో? ఆయనో, నేనో చచ్చిపోయిందాకా తప్పదుగావును! అందరూ ఇట్లాంటి బాధ సహించే కాపరం చేస్తున్నారా? వాళ్ళు యేడుస్తున్నట్లు కనపడదే! మా అమ్మ దగ్గిర యేడ్చాను. "వొద్దు, నీ దగ్గిరే వుంటాను. ఆయన్ని చూస్తే భయమ"ని. మొదట నవ్వింది. తరువాత తిట్టింది. చాలా కోపంగా తిట్టింది. చెట్టు మొలవటం పెద్దది కావడం, కాయడం ఎట్లానో ఆడపిల్ల పుట్టడం, పెరగడం, పెళ్ళికావడం, పెద్దదవడం, కార్యం చేయడం మామూలయింది. యేమన్నా ఈ పనుల కాటంకం వచ్చినట్లయితే సృష్టికాటంకం వచ్చినట్టే వుంటుంది వాళ్ళకి. అందులో ఆడపిల్లని చిన్నపిల్లని నేను కాపరం వొద్దనడమే! ఇంకేముంది! ఇదివరకిల్లా వద్దన్న వారున్నారా? వుంటే! అట్లాంటివాళ్ళని లోకం మెచ్చుకుందా? చెట్లు పువ్వు పూయకపోతే ఆగుతారు. గొడ్డు చూలు కాకపోతే 'యేం చెయ్యలేరు. నన్నో....నోరుమూసి బలవంతం చేసి తన్ని జ్ఞానమూ, మాటలూ, బాధా, సిగ్గూ, అభిమానము, ముందే భయమూ వున్న నన్ను స్వతంత్రజీవిని, వీళ్ళెవరు నన్నిట్లా నిర్బంధించాడనికి? నన్ను కన్నారు. తిండి పెట్టారు. అందుకని వాళ్ళ వస్తువునైనాను. వాళ్ళ మృగాన్ని. నన్ను వీడికి అమ్మారు. వాళ్ళని నేను కనమన్నానా? కన్నందుకు తిండి పెట్టారు. పోనీ పెట్టకుండా చంపకపోయినారా? ఇంతకంటె బాగా వుండిపోయేది! తిండిపెడితే మాత్రం, పశువుకి గడ్డి వెయ్యలేదూ? నేనూ అంతేనా, మా అత్తని తీసికెళ్ళి బలవంతంగా యెవరికన్నా ముడిపెడితే? చిన్నదాన్ని, నోరులేనిదాన్ని గనక కాదూ! వాళ్ళు నన్నిలా చేసింది.

పోనీ తల్లి! తల్లిగా! చిన్నప్పటినించి నా మీద అంత అధికారం చేసింది. అప్పటికయినా పెళ్ళి అంటే ఏమిటో, స్త్రీ ధర్మం ముందు ముందు ఎట్లా కష్టంగా వుంటుందో, అన్నీ చెప్పిందా దగ్గిర కూచోపెట్టుకుని? అది తప్పు అట్లాంటి మాటలు చిన్నపిల్లలతో అనకూడదు. చిన్నపిల్లల్ని హఠాత్తుగా గదులలోకి పంపవచ్చు. ఆ అమ్మ నిర్మలమైన నోట్లోనించి అన్ని తిట్లు వొచ్చాయే ఈ మాటలు రాకూడదూ?

ముహూర్తానికి సరిగా వొచ్చారు. నన్ను సాయంత్రం ముస్తాబు చేస్తో వుంటే, బలికి తయారుచేస్తున్న మృగాన్ని లాగుంది. నేను మా ఆయనకొక యంత్రంగా వున్నాను. పురుషుల దృష్టికి స్త్రీ అంతే కాబోలు ఇన్నాళ్ళూ నేను పెరిగిందీ, భోజనం చేసిందీ, ఆడుకున్నదీ, చదువుకున్నదీ అంతా ఈయనకిప్పుడు బలి కావడానికే. సృష్టిలో వున్న మానవులలో సగంమంది తక్కిన సగంమందికి యెందుకిట్లా బానిసలు కావాలో! అందముంటే మొగవాడిని భరించేటందుకు, బలముంటే మొగవాడికి చాకిరీ చేసేటందుకు; చదువుకుంటే మొగవాడికి పద్దులు రాసేటందుకు, సంగీతమొస్తే మొగవాణ్ణి సంతోషపెట్టేందుకు. ఇంత అన్యాయం లోకమెట్లా భరిస్తోందో! ఆచారమనే బురదలో కుళ్ళిపోయి నశించాయి మనవాళ్ళ హృదయాలు. ఈ మొగ రాక్షసుణ్ని సంహరించి ఈ అనాథులను కాపాడడానికి ఏ రాముడూ అవతార మెత్తడూ!

ఆ సాయంత్రం నేనెంతో ఏడ్చాను. ఎంతో బతిమాలుకున్నాను. కాని లక్ష్యమెవరికి. మా తాతయ్యకి కాదుగా ఆ రాత్రి బాధ. కప్పని పట్టపొయ్యే పాములాగు పీటలమీద కూచున్న ఆయన కళ్ళు మెరుస్తున్నాయి. "ఇంకెంత సేపులే!" అని వెక్కిరిస్తున్నాయి. ఈ దుర్గతినుంచి తప్పించుకోడానకి వీల్లేదు. నేనేం నేరం చేసాను! ఈ కఠినశిక్షకి? వురిశిక్ష పడ్డవాడికన్నా కొంచెం ఆశ వుంటుంది ఎట్లాగో వొకలాగు తప్పించుకోవొచ్చునని. ఎవరో తనమీద కనికరించవొచ్చని. నాకో! నన్ను నా శరీరాన్ని, నా హృదయాన్నీ, మానాన్నీ నా కోర్కెల్నీ ఆ విధంగా ఒక్కరాత్రిలో తమ ఇష్టం వొచ్చినవాడిముందు ఆటంకం లేకుండా బట్టబయలుగా ఒలిసి పడెయ్యడానికి యెవరిచ్చారు ఆ అధికారం? గొల్లుమని కళ్ళవెంబడి రక్తం కార్చే యీ అనాథ తలిదండ్రులే బలియిచ్చే యీ నరపశువు రోదన ధ్వనులు యెవరి చెవికెక్కుతాయి! నిమిషాలు జరిగినకొద్దీ అసహ్యమైన కొండబల్లి అందమైన రెక్కలపురుగు దగ్గిరకి వెనకాలే జరుగుతున్నట్టుంది.

రాత్రయింది. రమ్మన్నారు. ఏడ్చాను. నా ప్రాణంకోసం నా మానంకోసం పోట్లాడాను. లాక్కువెళ్ళి గదిలో తోసి తలుపేశారు. మేక కోసం కాచుకుని వుండి, ఆకలితో బోనులో అటూ ఇటూ తిరిగే పెద్దపులిలాగ పచార్లు చేస్తున్నాడు ఆ గదిలో. వొణుకుతో తలుపుమూల దాక్కున్నా. చెయ్యి పట్టుకుని తీసికెళ్ళి మంచంమీద కూలేసి, దగ్గిర కూచ్చుని అసహ్యంగా సరసాలు మొదలెట్టాడు. ఒకటే ముక్కుపొడుం కంపు. వేళ్ళతోటి ముక్కు తుడుచుకుని, మంచం పట్టెకి రాస్తాడు. ఆ చెయ్యే నా మెడమీద వేస్తాడు. ఆ వేళ్ళతోటే అక్కడ బల్లమీద

వున్న జిలేబీ ముక్క తుంచి నా నోట్లో పెడతాడు. పైగా "నన్ను చూస్తే నీ కెందుకు అసయ్యి"మని అడుగుతాడు. అయిదు నిమిషాలు చూసి పాతకథ మొదలుపెట్టాడు. ఆ కళ్ళకి నేను బాధా, ఇష్టం, మనసూ వున్న మనిషిగా లేను. కామం తీర్చుకునే యంత్రమైనాను.

రాత్రి అరిచినందుకు తాతయ్య నన్ను కొట్టడానికి సిద్ధమైనాడు. యెంత బాధ కలిగినా అరవకూడదట. మంగలి తనకి క్షవరం చేసేటప్పుడు నెప్పిపుట్టిందని బిగ్గరగా అరిచి, వాణ్ణి తన్నడానికి సిద్ధమైనాడు. పోనీ నన్ను తిట్టినవాడు ఆయన్ని కూడా ఆ బండతనానికి తిడతాడేమోనని ఆశపడ్డాను. కాని భోజనం దగ్గర ఆయనతో అంటున్నాడు. "మొదట అందరూ అంతేనండి. అదే అలవాటవుతుంది. ఏం ఫరవాలేదు. సంశయించకండి." నా గుండె గుభేలు మంది. తాతమీద, అమ్మమీద వొళ్ళు మండింది. వాళ్ళందరినీ చంపాలనిపించింది.

మర్నాడు రాత్రి ఆయన నాకు వుపన్యాసం ఇవ్వడం ప్రారంభించాడు. ముందు కొంతసేపు పాతివ్రత్యమూ, స్త్రీ ధర్మమూ బోధించాడు. కొన్ని తెలుగు పద్యాలూ, సంస్కృత శ్లోకాలూ చదివాడు. సీతా, మండోదరి, అరుంధతీ వీరి వుపమానాలు చెప్పాడు. తరవాత తన మొదటి భార్యతో పోల్చాడు?

"ఇప్పుడు నువ్వు ఈ కాస్తకా గోల పెడుతున్నావు? అప్పుడు నేను నడియవ్వనంలో వున్నాను. సన్నగా, బలహీనంగా వుండేది. కళ్ళు జబ్బు చేశాయి. ఎప్పుడూ తలనెప్పి అనేది. అట్లా వున్నా వొప్పుకునేది. ఇంక భార్య అయినాక తప్పుతుందా?"

పాపం అట్లానే చచ్చిపోయింది గావును. నా గతీ అంతే! అని కొత్త భయం పట్టుకుంది.

"అది కారణం లేకుండానే చిక్కిపోయి జబ్బుపడ్డది. జబ్బులోవున్నా యెన్నడూ పెంకితనం చేసేదికాదు. చాలా బుద్ధిమంతురాలు. పతివ్రత, తరవాత పెళ్ళి వొద్దనుకున్నాను. ఏ రాత్రికి ఆ రాత్రి డబ్బుపారేస్తే ఇష్టమొచ్చినవాళ్ళు దొరికేవారు. పదిహేనేళ్లు సుఖంగా జరిగింది. కాని అమ్మ వూరుకోలేదు. నా ముసలితనంలో నన్ను చూసేవారు వుండరని పెళ్ళి చేసుకోమని పట్టు పట్టింది. నిజమే ఈ ముండలందరూ ముసలితనంలో నా మొహం చూస్తారా? చేసుకున్న పెళ్ళామంటో వుండాలిగాని! నేను ముసలి వాణ్ణవుతున్నాను. వాళ్ళ యిళ్లు పట్టుకు తిరగడానికి వోపికలేదు. ఇంక స్థిరపడే కాలమొచ్చిందని నాకు తోచింది"

మూడురాత్రిళ్లూ అయినాయి. నన్ను వెంటనే తీసుకెడతామన్నారు. మా అమ్మ దగ్గిరా, తాతయ్య దగ్గిరా, కళ్ళుకాయలుకాసేటట్టు ఏడ్చాను వెళ్ళనని. కాని కొంచెమన్నా కనికరం రాలేదు వాళ్ళకి. నాకు ముల్లు గుచ్చుకుంటే గిలగిలలాడేవాళ్ళు ఇప్పుడు నామీద యెందుకు జాలిపడరు? వొళ్ళంతా జెర్రులుపాకేకంటె బాధే, అసహ్యమే! నామీద దయరాదేం? చిన్నప్పట్ణించీ నేను పెరిగిన యిల్లూ, దొడ్లో నేను పెంచిన గన్నేరుమొక్కా, దానిమ్మచెట్టూ వొదలిపోవడమంటే యెంతో దిగులు వేసింది. కాని యెవరితో చెప్పుకోను? అమ్మ శివగంగ వెళ్ళినప్పుడు మూడు రోజులు పిల్లిని ఇంట్లో వదిలేసి వుండలేకపోయింది. నాకెంత కష్టంగా వుంటుందో ఆలోచించినవాళ్ళే లేరు.

అత్తవారింటికి వెళ్ళాను. పెద్ద యిల్లు వాళ్ళది. ఆ ఇంట్లో మా అత్తగారు మాత్రముంది. ఇంకెవరూ లేరు. ఆమె నన్నెంతో ఆదరించి ప్రేమగా చూసింది. ఇంట్లోపని అంతా ఆమే చేసుకునేది, వంటకూడా. ఆమె నేనేమన్నా పని ముట్టుకుంటే కేకలేసిది. ఆయన చూశారంటే ఆమెమీద పడి కేకలేసేవారు. ఆయన అభిప్రాయం నా శక్తి ఇంక దేనికీ ఉపయోగించకూడదని లాగుండేది. పొద్దున్నించి సాయింత్రందాకా మళ్ళీ సాయంత్రంనించి ప్రొద్దునదాకా సిద్ధంగా పడుకుని వుండడం తప్ప పనిలేదు. ఇంతే నా బతుకంతా. భారతం, రామాయణం, భాగవతం పడేశాడు చదువుకోమని. సాధారణంగా యెప్పుడూ ఇంట్లోనే వుండేవాడు. కాని నాతో అట్టే మాట్లాడేవాడు కాదు. ఆయనకి ఇంకేమీ తోచేదికాదు, ఆ ఇంట్లో ఏమి జరుగుతున్నా నాకు పట్టదు. నేను కృతజ్ఞతా, సంతోషం, ప్రేమా చూపనందుకు ఆయనకి కోపం విసుకూ వొచ్చేవి. ఆయన మీద ప్రేమ చూపనందుకు ఆయనకి కోపం విసుకూ వొచ్చేవి. ఆయన మీద ప్రేమ ఎట్లాచూపాలో, యెందుకు చూపాలో తెలిసేది కాదు. నా స్నేహితుల మీద చూపటం తెలుసు. కాని ఆయనమీద ప్రేమ యెట్లా చూపడం? తిట్టేవాడు. మొదటిది యెంతకష్టంగా వున్నా, యెట్లాచెబితే, అట్లా వినేది. దొంగ సంతోషమన్నా కనపరిచేది. ఇది మొండికదా?'' అనేవాడు. ఆయన్ని చూస్తే దిగులేసిది. నా భర్తే కాకపోతే ఆయనమీద ఇష్టమూ, గౌరవముండేదనుకుంటాను. ఆయన స్నేహితులందరూ ఆయన్ని చాలా ప్రేమతో చూసేవారు. వారిమీద ఆయనకి చాలా ప్రేమ. దయగలవాడు, ధర్మాత్ముడు. ఇంటికి వచ్చిన బిచ్చగాళ్ళందరూ ఆయిన్ని దీవిస్తూ వెళ్ళేవారు. ఆయనకి ఆ వూళ్ళో చాలా మంచి పేరుంది. నాకేం లాభం? అంతా మంచితనాన్ని అనుభవించారు. నేను మాత్రం ఆయన అర్ధాంగినీ ప్రాణనాయకినీకదూ! నేను మాత్రం ఆయన దుర్గుణాలనే అనుభవించవలసి వొచ్చింది.

ఒకనాడు నాతో మా అత్తగారు "అమ్మాయీ ! పోనీ, మీ తాతయ్యని వొచ్చి నిన్ను నాలుగు రోజులు తీసుకెళ్ళమని రాయి'' అని కార్డు యిచ్చింది. రాశాను. మా తాతయ్య వొచ్చాడు. ఆయన్న నన్ను పంపనన్నాడు. అయినా కాని నన్ను తీసుకెళ్ళమని మా తాతయ్యని బతిమాలుకున్నా వినిపించుకోలేదు. "తాతయ్యా! నువ్వే ఇట్లా నామీద కనికరం చూపకపోతే నాకు దిక్కేమిటి?'' అని ఏడ్చాను. ఆయన కళ్ళంబడి నీళ్ళుకారాయి.

"ఒకరి చేతుల్లో పెట్టిన తరవాత యింక మా పెత్తనమేమిటి? ఆయన్ని వొప్పించు'' అన్నాడు.

నా కోసం మా తాతయ్య ఆయనతో విరోధం పెట్టుకుంటాడా? భోజనంలో మామిడిపళ్ళూ, మధ్యాహ్నం ఆవడలు, ఫలహారం, వచ్చినప్పుడల్లా పట్టంచు పంచలచాపూ నా కోసం పోగొట్టుకుంటాడా? నాకు తెలీకుండా వెళ్ళిపోయినాడు.

నాకూ పెనిమిటికీ పోట్లాటలు ఎక్కువైనాయి. ఆయనమీద దొంగ ప్రేమ చూపాను కొన్నాళ్లు, ఎట్లానన్నా ఆయన్ని సంతోషపెట్టి సుఖపడదామని. అందరు పతివ్రతలూ ఎట్లా

వుంటారో, అట్లా వుండాలని అనుకరించాను, నా స్వభావాన్ని చంపుకుని. ఆయని ఛాయని కావాలని చూశాను. దొంగపనులు, నీచమయిన పనులు చేశాను. కాని నన్ను చూస్తే నాకు పరమ అసహ్యం అయింది. దొంగతనం నా స్వభాంలో లేదు. నన్నూ, నా శరీరాన్నీ, నా స్వభావాన్నీ రోత చేసినట్లుంది. అంతా వోర్చుకుని నా శరీరం యిచ్చేస్తే చాలదట సంతోషంగా కనపడి తనమీద మోహం చూపి...... ఛా తలుచుకుంటే యీ శరీరాన్ని తగలపెట్టాలని బుద్ధిపుడుతోంది. నీళ్ళల్లో పడితే చాలదు. నిప్పుతో సుద్ధిచెయ్యాలి..... అలాంటి పనులు చెయ్యమనేవాడు.

వారం రోజుల తరవాత యేదో బాధ మొదలుపెట్టింది. డాక్టరుని పిలువలేదు. చాలా జబ్బుచేసింది. మంచం వదలలేదు. ఆఖరికి డాక్టరు వచ్చి చూశాడు. “నాకు తెలీదు. ఆడ డాక్టరుని పిలవ”మన్నాడు. ఆ వూళ్ళో మిషనరీ లేడీ డాక్టరుని పిలిచారు. ఆమె, ఆ మొగ డాక్టరు కలిసి మాట్లాడుకుని, నా పెనిమిటితో యింగ్లీషులో కఠినంగా మాట్లాడారు. ఆయన మీ కెందుకన్నట్లుగా జవాబు చెప్పాడు. “మై వైఫ్! మై వైఫ్!” చాలాసార్లు అన్నాడు. నా కెన్నేళ్లు అని అడిగారు. “పోలీసు మేస్ట్రేట్” అని కూడా అన్నారు. నా భర్త వాళ్ళని బయటికి నడవమన్నాడు. అటు తరవాత ఆ డాక్టరుని పిలవలేదు. తెలుగు మందులు మొదట వాడారు. మూర్ఛలు మొదలుపెట్టాయి. చాలా బాధపడ్డాను. మూర్ఛవంకపెట్టి భరించలేక, తన్ని, రక్కి గంతులు వేసేదాన్ని. మళ్ళీ మా తాతయ్య వొచ్చాడు. అయినా పంపలా. ఆయన వెళ్ళిపోయినాడు.

ఇంక ఆ ఇంట్లో వుండకూడదని నిశ్చయించుకున్నాను. ఒక్క నిమిషం సౌఖ్యమను భవించలేదు. బాధా, అసహ్యమూ, భరించనలవి కావటంలేదు. ధైర్యంచేసి ఒకరోజు రాత్రి ఆయనతో మాట్లాడాను. ఆయనతో కాపురం నాకిష్టంలేదనీ, చాలా కష్టంగా వుందనీ, మా యింటికి వెడతాననీ, ఇంక రాననీ, ఆయన యింకోపెళ్ళి చేసుకోవచ్చనీ, ఆయన ఇచ్చిన నగలూ, చీరెలూ, అన్నీ యిచ్చేస్తాననీ, యీ కాస్త వుపకారం చేస్తే అజన్మాంతమూ నేను కృతజ్ఞురాలనై వుంటాననీ అన్నాను. ఆయన వొప్పుకోలేదు, నాకు వొచ్చే నష్టాల సంగతి చెప్పాడు. ఇప్పుడు ఇలా వున్నా, తరవాత భర్తలేకుండా బతకడం కష్టమనీ, నాకు నలుగురిలో మర్యాద ఏమీ వుండదనీ, మొగుడు వదిలేసిన ఆడదంటారనీ, మావాళ్ళు కూడా సరిగా చూడరనీ అన్నాడు. అన్నీ భరిస్తానన్నాను. నేను పెద్దదాన్నై నీతి చెడిపోతానన్నాడు. పోనీ అన్నాను. అప్పుడు తనకపరిదిష్ట. వేరే పెళ్ళికావాలి. మళ్ళీ ఖర్చు అన్నాడు. అయితే నాకేమన్నాను. వీల్లేదన్నాడు. వీల్లేదట! నా వొళ్లు మండింది. ఏం నేరం చేశానని యీ కయిదు! ఇది సంసారం కాదూ! కయిదా! యెట్లాంటి నేరంచేసినా, ఎప్పటికో అప్పటికి విడుదలవుంది. యీ వివాహం నేరం మా తాతయ్యా, వాళ్లూ నాకు చేసినందుకు. అజన్మాంతమూ విడుదల లేదు. నేను పారిపోతానన్నాను. నేను నిజంగా పారిపోవాలని చూస్తున్నాననీ, తాను అడ్డుపెట్టలేడనీ, వేళాకోళం కాదనీ నచ్చచెప్పాను. మళ్ళీ నన్ను పట్టి

తీసుకొస్తానన్నాడు. సరే. ముందు పారిపోతానన్నాను. తలకెక్కింది. వెంటనే యేడ్చాడు. యేడ్చి అప్పుడు నిజం చెప్పాడు.

"నువ్వు పారిపోతే నా ప్రతిష్ట ఏమవుతుంది? మొదటిదాని చావును గురించే అనుమానాలున్నాయి. నువ్విలా పారిపోతే ఇంక ఏమని తలెత్తుకు తిరగను? పెళ్ళాం లేచిపోయిన మొగాణ్ణి చూస్తే గౌరవం ఎవరికుంటుంది. ఆ పని చెయ్యకు. నీకేం తక్కువ చేస్తున్నాను నేను? పెడుతున్న బాధ ఏముంది?" అన్నాడు. నాకసహ్యమేసి వూరుకున్నాను.

ఆ ఇంట్లో ఒక ముసలి చాకలి వున్నాడు. వాడు ఎన్నో ఏళ్ళనించి వాళ్ళింటోనే వున్నాడుట. వాడంతకు ముందు నాతో ఒక మాట మాటాడలేదు. ఒకరోజు మధ్యాహ్నం నేను ఒంటరిగా వున్నప్పుడు తనే నాతో మాట్లాడాడు. నన్ను పుట్టింటికి వెళ్ళమనీ, ఆ ఇంటో వుంటే చచ్చిపోతాననీ మొదటి ఆమె కూడా యిలానే పోయిందనీ అన్నాడు. తాను సహాయం చేస్తానన్నాడు. అంతా రహస్యంగా జరిగింది. మర్నాడు మధ్యాహ్నానికి మా వూరు చేరుకున్నాను. మా వాళ్ళు నన్ను చూసి చాలా సంతోషించారు. మా తాతయ్య కావలించుకున్నాడు. మా అమ్మ ఏడ్చింది. మళ్ళీ ఆ ఇల్లూ, వాళ్ళ మొహాలూ, చూసేటప్పటికి నా ప్రాణం లేచివచ్చింది. నా కష్టాలు మరచిపోయినాను లోకంలో సౌఖ్యముందికదా నాకు ఇంకా అనిపించింది. ఎందుకు వీళ్ళని వదలివెళ్ళానా, అని ఆశ్చర్యం వేసింది. దొడ్లో నాగన్నేరు మొక్కపూలు పూస్తోంది. దూడ పాలిస్తోంది. అన్నీ నావి అలానే వున్నాయి. పాపం, మా అమ్మమీదా అత్తమీదా వృధాగా ఎంత క్రోధంగా వుండేదాన్ని!! అనుకున్నాను.

అన్ని ఆశలూ బూడెదయినాయి మర్నాడు ఆయన పరుగెత్తుకొచ్చాడు. నేను చెప్పకుండా వచ్చినట్లు మావాళ్ళకీ తెలిసింది. మా తాతయ్య మొహం తిప్పేశాడు. అత్త యింక తిట్లు చెప్పనక్కరలేదు. అమ్మ "నా కడుపున చెడపుట్టావే చిన్నప్పుడా విషజ్వరంలో చావనన్నా చచ్చావు కావంది." ఆయన రమ్మన్నాడు. ముందు చచ్చిపోతా గాని, రానన్నాను, చాలా తగాదా జరిగింది. వూరంతా గోలయింది. ఏమైనా వెళ్ళకూడదని నిశ్చయించుకున్నా. రాత్రులు యింక ఆయనతో ఏం చెప్పను? ఆ కోపం, ఆ కసీ, ఆ దౌర్జన్యమూ! మా తాతయ్య నన్ను తన్నడానికి సిద్ధమైనాడు. తాతయ్యా నీకెందుకు అంత కోపం నామీద? నేనేం చేశా నిన్ను? నీకేం కష్టమొచ్చింది. నీ కప్రదిష్టా? కచేరీలో లంచాలు తెచ్చేవాడివే, ఆ రాత్రి దొర కాళ్ళమీద పడ్డావే, ఆ దొర తిట్టిన తిట్లు భరించావే, నేను నీ యింటికి రావడం నీకు నామోషీ అయిందా? దేవతార్చన చెయ్యకండా భోజనం చెయ్యవే. ఆ దేవుడు ఏమనుకుంటాడో అని ఆలోచించావా? నీ పొరుగున్న వున్న సుబ్రహ్మణ్యంగారేమంటారో అనుకున్నావు గాని! పతివ్రత తనంట? భార్యకు భర్త తప్ప గతిలేదుట! పుస్తకాల్లో రాసిన ఆ నీతులు తప్ప నీ బుద్ధితో ఆలోచించవా? దొర కాళ్ళమీద పడడం మంచిదని ఏ భారతంలో రాసివుంది? తాతయ్యా! అది హిందూ పురుషధర్మమేనా? నేను పోతున్నాను నా అపకీర్తి యింక నీకుండదు. యిప్పుడన్నా నాకోసం ఒక్క కన్నీరుబొట్టు ఒస్తుందా!

యిప్పటికీ నాకు కావలసిన శాస్తే అయింది అనుకుంటావా! నీదేమన్నా తప్పుందేమోనని యిప్పుడన్నా తోస్తుందా!

ఇంక అక్కడ నిలవడం అశక్యమయింది నాకు. తిండి కూడా సరిగా పెట్టడం మానేశారు. చాల అవమానం వేసింది. చచ్చిపోదామనుకున్నాను. ఇంక గతిలేని ఆడదానికి దిక్కేముంది? ఆ రాత్రి బయలుదేరాను. కాలవ దగ్గిరికి వెళ్ళేటప్పటికి భయమేసింది. నల్లగా, చల్లగా నీళ్ళు కనపడ్డాయి. వెచ్చని ప్రాణాన్ని దాంట్లో పోగొట్టుకో బుద్ధెయ్యలేదు. ఇంటి కెళ్ళడానికి యిష్టంలేదు. కాలవలో చావడానికి ధైర్యంలేదు. ఏడుస్తో కూచున్నా, అట్లా ఏడుస్తోనే వూళ్ళోకి వచ్చాను. మన వూళ్ళో బోగంది నాగమణి అట్లా వెడుతూ నాతో మాట్లాడింది. నా సంగతి ఆమె ఇదివరకే వూహించింది. నా మీద ఏమీ కోపం లేకుండా మాట్లాడింది. దేవుడు పంపిన దూతవలె కనపడ్డది. తనతో వొచ్చి వుండమంది. వెళ్ళాను. నాలుగు రోజులు ఎంతో సంతోషంగా గడిపాను. అంతదయ నా కెవరూ చూపించలేదు. ఆమె పాదాలమీద పడి కళ్ళకద్దుకోవాలనిపించిది. ఆఖరికి నన్ను వెతికి కనుక్కున్నారు. వొచ్చారు-నా పెనిమిటీ తాతయ్యా! మణి నన్ను కనపరచలేదు. మణి స్నేహితులు మొగవాళ్ళెవరో వున్నారు వాళ్ళందరూ దూకుడుచేసి, తాతయ్యా వాళ్ళనీ లోపలికన్నా రానీలేదు. మళ్ళీ సౌఖ్యంగా వున్నాను ఆ యింట్లోనే. వారం రోజులయిన తరవాత నలుగురు పోలీసు వాళ్ళు వచ్చారు. నన్ను తీసుకెళ్ళడానికి, మణి పాపం ఏడ్చింది. నన్ను చూసి "మా కులంలోనన్నా యెందుకు పుట్టావు కావమ్మా! యీ బానిసత్వం వుండేదికా"దంది! నా పెనిమిటినే వెళ్ళి, ఆ మణిని నన్ను వుపయోగించినట్లు వుపయోగించమను వూరుకుంటుందేమో! వాళ్ళని మనం హీనంగా చూసి మన యిళ్ళకి రానీము. వాళ్ళా మనని హీనంగా చూడవలసింది మనము వాళ్ళనా ? నన్ను పోలీసు యిన్‌స్పెక్టరుగారింటికి తీసికెళ్ళారు. పాపం మణి కూడా వెంటవొచ్చింది. అక్కడ తాతయ్యా, పెనిమిటీ వున్నారు. అందరూ కలిసి మణిని చెడతిట్టారు. మణి బాగా బుద్ధి చెప్పింది. కాని వాళ్ళ చెవుల కెక్కుతాయా ఆ మాటలు? ఆ యిన్‌స్పెక్టర్ నన్ను నా భర్తతో వెళ్ళమన్నాడు. ఆయన నన్ను తాకనని వాగ్దానం చేస్తే వెడతానన్నాను. లేకపోతే ఏమైనా వెళ్ళనన్నాను.

"అయితే నువ్వెందుకు పెళ్ళి చేసుకున్నా"వన్నాడు ఆ యిన్‌స్పెక్టర్. "నేనుకాదు. వాళ్ళు చేశారు! అదిగాక అప్పుడు పెళ్ళంటే యీ ఘోరమని నాకు తెలీదు. నా కెవరూ చెప్పలేదు" అన్నాను.

"అదంతా మాకు తెలీదు. ఆయన భార్య అయిన తరవాత నువ్వు ఆయన దగ్గిర వుండాలి. ఆయన ఏం చేసినా సరే" అన్నాడు.

నాకు పెద్ద ఏడుపు వొచ్చింది. ఆయనకి తెలిసిందల్లా నన్ను ఆడదాన్ని, వొంటరిదాన్ని భర్తచేతికి వొప్పచెప్పడమే. నా వొళ్ళు నాదికదూ? నన్ను ముట్టుకోకూడదని యింకొకరిని

నేననకూడదూ? భోగంది అంటుందే స్వేచ్ఛగా ఆ మాట! పవిత్రంగా అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకున్న నేననకూడదూ? పూర్వం బానిసలుగా అమ్మేవాళ్ళే; అప్పుడకూడా వాళ్ళ శరీరాలమీద యింత అధికారం వుండేదా యజమానులకి? పుండుపడ్డ యెద్దులని బళ్ళకు కట్టి బాధపెడితే పోలీసులు పట్టుకుంటారు. కాని భార్య భర్తవద్ద యిట్లా నరకబాధ పడకపోతే కాళ్ళూ, చేతులూ కట్టి భర్త ముందు "నీ యిష్టం వొచ్చినట్లు చేసుకోమ"ని పారేస్తారు. నాగరికత గల దేశంట!

ఆయనతో పంపారు మళ్ళీ. ఆ యింట్లో తయారు మేము. మా అత్తగారేమీ అనలేదు. అంత ప్రేమగానూ వుంది. కాని పూర్వంకంటె బాధ లెక్కువ అయినాయి నాకు. పూర్వం ఆయనకి దయ లేక పోయినా అందరూ అనుకునే ప్రేమగావును వుండేది. ఇప్పుడదేమీ లేదు. వెక్కిరింపులూ, తిట్లూ మామూలయినాయి. నేను బతకవలసిన అవసరం కనబడలేదు. ఆయన బతికివున్నాళ్ళూ నే నొక్కరోజు సౌఖ్యపడను. పాపం ఆయన పోవడమెందుకు? నేను పోతాను. మళ్ళీ పెళ్లి చేసుకుంటారు. అపరిదిష్ట వుండదు. అన్నీ తీరిపోతాయి. మా అమ్మకీ, తాతయ్యకీ నా మూలాన పేరు చెడిపోదు. ఇంక అందరూ తలలెత్తుకు తిరగవొచ్చు. ఈ రాత్రి నీళ్ళు చూసి భయపడను. ఈ కాగితాల్లో నా సంగతి అంతా రాసిపెట్టాను.

మన స్థితి యిదీ. నీ భర్తతో నువ్వు సుఖంగా వున్నావనుకుంటా. కాని నాకు లోకంమీద నమ్మకం పోయింది. నామీద మనవాళ్ళు అందరూ ప్రేమగా వుండేవాళ్ళే. ఇప్పుడు ఒక్కరు నాతో మంచిమాట మాట్లాడినవారు లేరు. నిజమేమిటని అడిగినవాళ్ళు లేరు. ముందే నిశ్చయం వాళ్ళకి ఏ సంసారంలో తప్పులున్నా ఆడదానివేనని. నువ్వన్నా నాతో మాట్లాడతావనుకున్నా. ఆ మధ్యాహ్నంతో ఆ ఆశకూడా పోయింది. నీ తప్పేముంది? ఇట్లాంటి అపవిత్రులరాలితో మీ పవిత్రమయిన జీవనాన్ని మలినం చేసుకుంటారా? తరవాత యెంత కష్టం? భర్త ఏమంటాడో? నా పేరు వుచ్చరించి యెందుకు పాడుచేసుకోవాలి? మీ పుణ్యాహక్కులని? సంఘమంతా కలిసి భర్త నిచ్చిన తరవాత ఆ భర్త చెడ్డవాడంటే సంఘం వూరుకుంటుందా? నువ్వే చెడ్డదానవంటుంది. యెంత గొప్ప స్త్రీ! ఎంత వోపిక గలది భార్య! ఏ బాధ పడ్డా ఓర్చుకోవాలి భరించే భార్య. అట్లాంటిది సిగ్గులేక యిలా చెప్పుకుంటుందా వీధిలోకొచ్చి!

నా కెవరిమీదా ప్రేమలేదు మణిమీద తప్ప. ఆ మాట అంటే నా నాలిక కాలుస్తారు. భర్తమీద ప్రేమలేదుట ఆ మాట అనడమే! పెళ్ళి కావడంతోటే అకస్మాత్తుగా, అవ్యాజ్యంగా వొచ్చేయాలి ప్రేమ. రాకపోతే, రాకపోయినా, వొచ్చినట్లు నటించకపోతే సంఘం వొప్పుకోదు. చచ్చిపోయిన నా దేహాన్ని ఆయనకి వొప్పజెప్పరుగదా ? నా శరీరం నాదికాదుగా! దేవుడిదన్నా ఒప్పుకుంటారో లేదో! నన్నెక్కడ పట్టుకుంటాడో, స్వర్గంలోనా మళ్ళీ? నాకు స్వర్గమేమిటి?

ఆయనకి స్వర్గమే-నరకంలోకి పోతే ఈయన్ని తప్పించుకుంటాను. తరవాత ఏమన్నాకానీ యీ నరకం కంటే ఘోరమైంది యిక వుండదు. ఆ శుభ్రమైన నీళ్ళు నా వొంటినంతా కడిగేస్తాయేమో! నా వొంటికి అంటిన అసహ్యం నేను చేసిన దొంగపనులు, నీచమైన పనులు, ఆయన్ని సంతోషపెట్టాలని చేసిన పాడుపనులు కడిగేస్తాయేమో! గోదావరి నీళ్ళు పాపాల్ని కూడా కడిగేస్తాయంటారు. అట్లా అయితే స్వర్గమొస్తుంది గావును. వొద్దు వొద్దు ఎన్నటికీ స్వర్గమొద్దు. ఆయన పాలిటికి పడతాను మళ్ళీ. ఎన్నటికీ, ఏ జన్మానికీ, నాకు భర్తవద్దు. జన్మజన్మలకీ బ్రహ్మచారిణినయ్యేటట్లు కటాక్షించు యీశ్వరా, యిదే నా ప్రార్థన.

ఈ కాగితాలు చాకలికిస్తున్నాను - అతను మణికిస్తాడు ఆమె నీకిస్తుంది. శలవు.

"రుక్మిణి".

◆ ◆ ◆

*రచనాకాలం : **1924***

*ప్రచురణ : **(భార్యకథల సంపుటి)**, స్టూడెంట్స్ బుక్ సెంటర్, **1968***